క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సిద్దవటం : మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఫణిరాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగు కార్యాలయ సభా భవనంలో, మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

విచ్చలవిడిగా బైక్ రేసింగ్‌లు

రామాపురం : మండల కేంద్రంలో కొందరు ఆకతాయిలు బైక్ రేసింగ్‌లు చేస్తున్నారు. కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారిపై విపరీతమైన వేగంతో వెళ్తుండటంతో స్థానికులు భయబ్రాంతులకు గురవుతున్నారు. సాయంత్రం వేళల్లో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కి ఎదురుగానే మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతున్నప్పటికీ పోలీసులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏదైన ప్రమాదం జరిగేతే తప్పా పోలీసుల కదలికలు ఉండవని భోగట్టా. చాలా మంది ఆకతాయిలు ద్విచక్రవాహనాల సైలెన్సర్లు తీసి వేగంగా వాహనాలను నడుపుతున్నారని, ద్విచక్రవాహనలకు నెంబరు ప్లేట్లు లేకుండా నడపడం స్టైల్‌గా మారింది. అధికారులు చర్యలు తీసుకోవాలని మండల కేంద్రం ప్రజలు కోరుతున్నారు.

సింహ వాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు


స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు : పెనగలూరు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి వేణుగోపాలస్వామి సింహవాహనంపై ఊరేగాడు. పంచేటి వారు ఉభయదాతలుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 9 గంటలకు హరికథ కాలక్షేపం జరిగింది. అనంతరం వేణుగోపాలస్వామిని పురవీధులలో ఊరేగించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం హనుమంతు సేవ (రెడ్డిసంఘం) జరుగనుందని ఆలయ చైర్మన్ సుబ్బారెడ్డి తెలిపారు.

నేటి నుంచి జంగాలపల్లెలో భూ సర్వే

సిద్దవటం : మండలంలోని జంగాపల్లె గ్రామంలో శుక్రవారం నుంచి భూ రీసర్వే మొదలు పెట్టనున్నట్లు మండల సర్వేయర్ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ రైతు భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, సంబంధిత అధారాలతో అధికారులు పిలిచినప్పుడు భూముల వద్దకు రైతులు తప్పనిసరిగా హాజరై భూ రీసర్వేకు సహకరించాలని ఆయన కోరారు.

స్థలాలను పరిశీలించిన ఆర్డీఓ

రైల్వేకోడూరు : మండలంలోని జిల్లా సరిహద్దు గ్రామాలైన బాలపల్లె, కుక్కలదొడ్డి గ్రామాలకు సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కోసం కేటాయిస్తున్న 5 ఎకరాల స్థలాన్ని గురువారం రాజంపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓ భాస్కర్ పరిశీలించారు. అలాగే పట్టణంలో ఎస్‌ఈబీ డిపార్ట్‌మెంట్ వారికి నూతన భవనం కోసం కె.బుడుగుంటపల్లెకు పోయే దారిలో స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. రెవెన్యూ పరంగా పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు రామ్మోహన్, ఆర్ఐ రాజశేఖర్, సర్వేయర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపురమ్మకు ప్రత్యేక పూజలు



సంబేపల్లి : దుద్యాల పంచాయతీలో వెలసిన కొత్తపురమ్మకు గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో అమ్మవారి ఆలయాల్ని శుద్ధి చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. వీఆర్‌ఎల సమస్యలతో కూడిన బహిరంగ లేఖను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాశారు. గురువారం నగరంలోని హోచిమన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం


జీపు వెనుక వైపు నిలబడి ప్రయాణిస్తున్న దృశ్యం

జీవనోపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు ప్రయాణించే వారు తమ ప్రాణాలను పణ్ణంగా పెట్టి ప్రయాణం చేస్తున్నారు. లారీలు, ఆటోలు ఇతర వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. గమ్యం చేరాలనే ఆతృత ఉన్నా ఇలా ప్రమాదపుటంచున ప్రయాణం చేస్తే జీవిత గమ్యం చేరుకోవాల్సి వస్తుందన్న కనీస అవగాహన లేక ఇష్టం వచ్చినట్టు ప్రయాణిస్తున్నారు. ఆటో డ్రైవర్లకు పోలీసులు ఎన్నిసార్లు కౌన్సిలింగ్ ఇచ్చినా పరిస్థితి మారలేదు. వాహనలు పరిమితికి మించి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – రైల్వేకోడూరు


లారీ టాప్‌పై కూర్చొని ప్రయాణిస్తున్న దృశ్యం

చుక్కల భూములపై రైతులకు పూర్తి హక్కులు

రాయచోటి టౌన్ : రైతున్నలందరికీ చుక్కల భూములపై పూర్తి స్థాయి హక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కల్పించారని అన్నమయ్యజిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలోని శ్రీ సాయి శుభ కల్యాణ మండపంలో ఆర్డీఓ రంగాస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన చుక్కల భూముల రైతులకు సంపూర్ణ హక్కు పత్రాలను అందజేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఎన్నో పథకాల రైతులకు అందుతాయన్నారు. రైతుకు ఆ భూమిపై సంపూర్ణ హక్కు కలిగి ఉంటుందని చెప్పారు. చుక్కల భూముల రైతులు ఇకపై ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. దేవుడి మాన్యాల భూములు, దర్గా మాన్యాలు, వక్ఫ్ బోర్డు భూములకు సంబంధించి ఇనాం భూములకూ పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. 100 ఏళ్ల తరువాత భూముల రీ సర్వే, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష కార్యక్రమం ద్వారా రైతులు సమస్య పరిష్కారం అవుతున్నాయన్నారు.

చేతులు జోడించి వేడుకొంటున్నా..

రెవెన్యూ శాఖలతో పాటు ఇతరా శాఖలలో పని చేసే ఉద్యోగులు అందరినీ చేతులు జోడించి వేడుకొంటున్నా.. అవినీతి, అక్రమాలకు పాల్పడకూడదని అలాగే లంచాలకు పాల్పడకూడదని శ్రీకాంత్‌రెడ్డి విన్నవించారు. ఎక్కడైనా ఏ శాఖలోనైనా లంచాలు అడిగితే వెంటనే తన దృష్టికి తీసుకరావాలని


రాయచోటి టౌన్: రైతులకు భూ హక్కు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ అవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసుల రెడ్డి, గాలివీడు వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చిదంబరెడ్డి, జెడ్పీటీసీ మానస వెంకటరమణ, మాజీ ఎంపీపీ పోలు వెంకట సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకులు పల్లపు రమేష్, సంబేపల్లె మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ జయపాల్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహాసంఘం అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, ఎంపీటీసీ బి.నారాయణరెడ్డి, సర్పంచ్ నజీర్ అహమ్మద్, తిరుపాల్ నాయుడు, దివాస్, ఖాదర్ వలి, ఆసీఫ్ అలీఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు రాయచోటిలో జరపడం..

రాయచోటి అర్బన్ : ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలు రాయచోటి నిర్వహిస్తుండటం శుభపరిణామమని మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన సీపీఐ, గిరిజన సమాఖ్య నేతలతో కలసి ఆహ్వాన సంఘం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాషభలకు రాయచోటి పట్టణం వేదిక కావడం సంతోషకరమన్నారు. మహాసభలకు విచ్చేసే గిరిజనులకు మంచి ఆతిథ్యం ఇస్తామన్నారు. రాష్ట్రంలోని గిరిజనులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు నడుస్తోందన్నారు. జిల్లాలోని విద్యావంతులు, మేధావులు, రాజకీయవేత్తలు అందరూ కలసికట్టుగా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, గిరిజన సమాఖ్య జిల్లా కన్వీనర్ విశ్వనాథనాయక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రాయచోటి అర్బన్: ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గ్రామ వీఆర్‌ఓ పుష్ప రాజ్ కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వాదించారు. అనంతరం అప్పకొండయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తిమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి ఇచ్చిన విందుకు ఆయన హాజరయ్యాడు. తదుపరి వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం జనార్ధన్ రెడ్డి తండ్రి జి.నరసింహారెడ్డి దశదిన ఖర్మకాండలో శ్రీకాంత్ రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యేతోపాటు అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు వెంకట నారాయణ రెడ్డి, కాలాడి జనార్ధన్ రెడ్డి (సోని రెడ్డి), గంగమ్మ ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, చెన్న కేశవ రెడ్డి, నాగముని రెడ్డి, నాగ సుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణాలు నిలుపుతుంది

రాజంపేట టౌన్ : రక్తదానం వెలకట్టలేనిదని ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ కె.భాస్కర్ తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రీజనల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఇన్‌చార్జ్ ఆర్డీఓ ప్రారంభించి మాట్లాడారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం ఒకొక్కమారు ఇతరుల ప్రాణాలను సైతం నిలుపుతుందన్నారు. ప్రస్తుత కాలంలో ఎవరికైనా రక్తం అవసరమైతే సోషల్ మీడియాలో పెడుతున్నారని, అందుకు సంబంధించిన బ్లడ్ గ్రూపు ఉన్న వారు వెంటనే స్పందించి రక్తదానం చేస్తుండటం అభినందనీయమని కొనియాడారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలన్నారు. ఆంధ్రప్రగతి బ్యాంక్అందించే సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట, పుల్లంపేట బ్రాంచ్‌లకు చెందిన సీనియర్ మేనేజర్లు భాస్కర్‌రెడ్డి, మూరి శ్రీనివాస్, దుష్యంత్, శీనునాయక్ పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ భాస్కర్, బ్యాంక్ సిబ్బంది

జగనన్న హౌసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి

పెనగలూరు : మండలంలో జగనన్న పక్కా గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. గురువారం మండలాధ్యక్షురాలు సౌందర్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ డీఈ కుప్పుస్వామి మాట్లాడుతూ పెనగలూరు మండలానికి 1224 పక్కా గృహాలు మంజూరయ్యాయని, పక్కా గృహాలు వివిధ దశలలో నిర్మాణాలు ఉండగా కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని ఇంకా ప్రారంభించలేదని తెలియజేయడంతో మండల వైస్ ప్రెసిడెంట్ సచివాలయ పరిధిలో ఇంజనీరింగ్ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులతో చర్చించి ప్రతి ఒక్కరూ బేస్ మట్టాలు పూర్తిచేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. త్వరితగతిన బిల్లులు చెల్లించాలన్నారు. పేద వారు ఉంటే డ్వాక్రా సంఘాలు ద్వారా రూ. 35 వేలు రుణాన్ని లబ్ధిదారులకు కచ్చితంగా అందేలా ఏపీఎం చూడాలని సూచించారు. వచ్చే సమావేశానికి ఒక ఇల్లు కూడా పెండింగ్‌లో ఉండరాదని వారు తెలిపారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్ల పరిస్థితి, కార్యక్రమాలపై నివేదిక అందజేయాలన్నారు.


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి

ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇక విద్యుత్ సమస్యలు గాలికాలం కావడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అకాల వర్షాలు, గాలులు కారణంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోతున్నాయని, ప్రజలకు అంతరాయం కలుగకుండా విద్యుత్ శాఖ అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీధర్‌రావు, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శివ గౌడ్, పొందలూరు సొసైటీ అధ్యక్షుడు గుడ్ల వీరనారాయణ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను సమైక్యపరచడమే అజెండా

రాయచోటి అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలను సమైక్యపరచడమే తమ అజెండా అని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి, పాల ఏకిరి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్ నాయుడు, వడ్డెర సాధికార సమతి కన్వీనర్ వడ్డె వెంకట్, రాష్ట్ర వడ్డెర మేధావుల ఫోరం కన్వీనర్ జీవానందంలు అన్నారు. గురువారం వారు స్థానిక భానుహరి రెసిడెన్సీ వద్ద విలేకరులతో మాట్లాడుతూ కుల, పార్టీ, ప్రాంతాలకు అతీతంగా బీసీలను సమైక్యపరచడమే తమ ప్రధాన అజెండా అని పేర్కొన్నారు. అందుకోసం అందరం కలిసి పని చేస్తామన్నారు. ప్రస్తుతం బీసీ యువతలో రాజకీయ చైతన్యం కనిపిస్తోందన్నారు. బీసీలలో మరింతగా చైతన్యం తీసుకువచ్చేందుకు తమ వంతు కృషి సల్పుతున్నట్లు చెప్పారు. వెంటనే బీసీల జనగణన చేపట్టాలన్నారు. ధామాషా ప్రకారం 70 నుంచి 80 శాతం బీసీ ఓటర్లున్న రాయచోటి లాంటి నియోజక వర్గాలలో అన్ని పార్టీలు బీసీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నేతలను బీసీ ఉద్యోగులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో బీసీ ఉద్యోగుల సంఘం నేత రామాంజులు, జిన్నా కలెక్షన్ మేనేజర్ రమణ, మంజుల, నాగేశ్వరరావు, బి.సి. రమణ, ప్రొడ్యూసర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో ఆర్థిక అభివృద్ధి

వీరబల్లి (రాయచోటి టౌన్) : వ్యవసాయ రంగంలోని పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునని మట్లి సర్పంచ్ నాగార్జునాచారి అన్నారు. గురువారం మట్లి గ్రామంలోని బోడిరెడ్డి మల్‌రెడ్డిగారిపల్లెలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పుట్టిన పురిటిబిడ్డ నుంచి ముదసలి వరకు ప్రతి ఒక్కరూ పాలు తాగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇలాంటి సమయంలో పాడి పరిశ్రమకు మంచి డిమాండ్ ఉందన్నారు. అందుకే వ్యవసాయశాఖలో పాడి పరిశ్రమ ఒక ఆదాయ వనరుగా మారిందని చెప్పారు. ప్రస్తుత జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాడి రైతులను


పాడి రైతులకు మినరల్స్ అందజేస్తున్న సర్పంచ్

ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో మట్లి ఏడీఏహెచ్ జయప్రకాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా ఉపాధి హామీ పనులు

గాలివీడు : మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఎంపీడీఓ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం గుండ్ల చెరువు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. మండలంలో దాదాపు 4,700 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను పాటిస్తూ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వేసవి దృష్ట్యా పనుల వద్ద ఏర్పాటు చేసిన వసతులను ఆయన పరిశీలించారు. కూలీ గిట్టుబాటు అయ్యే విధంగా ఉపాధి కూలీలు పనులు చేపట్టాలని తెలియజేశారు. అనంతరం కూలీల మస్టర్లను తనిఖీ


ఉపాధి కూలీల మస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శేఖర్‌నాయక్

చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయనతో ఏపీఓ సంతోష్ , కూలీలు పాల్గొన్నారు.

బాల కార్మికులను గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 1 నుంచి 30వ తేది వరకు వివిధ శాఖల సమన్వయంతో బాల కార్మికులను గుర్తించి పునరావాసం కల్పించాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. రెండు బృందాలను ఏర్పాటు చేసి తేదీల వారీగా తనిఖీ చేయాల్సిన ప్రాంతాలను సూచించామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని వివరించారు.

ఉత్సవ మండపానికి శంకుస్థాపన


పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం ఉత్సవ మండప నిర్మాణానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. మండప నిర్మాణం పూర్తయ్యాక అమ్మవారి ఉత్సవ కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గునిశెట్టి రమేష్, చర్లపాటి హరినాథ్, కామిశెట్టి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేద్దాం


ఆహార పొట్లాలు అందజేస్తున్న దృశ్యం

చిట్వేలి : పండుగలు, విశేష దినాలలో అన్నదానం చేయడాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ విజ్ఞప్తి చేశారు. గురువారం తన పుట్టినరోజును పురస్కరించుకొని స్థానిక విద్యా వనరుల కార్యాలయ ప్రాంగణంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో పేదలు, యాచకులు, అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మానవత బాధ్యులు సురేంద్రరెడ్డి, మునిరావు, సాయిరాం, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అవినాష్, శివ, సుదీర్ రెడ్డి, తేజ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై పర్యాటకుల సందడి

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యాటకులు సందడి చేస్తున్నారు. సెలవులు కావడంతో పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. గురువారం భారీసంఖ్యలో సందర్శకులు కొండపైకి వచ్చారు. గాలిబండ, అటవీ సముదాయం, వ్యూపాయింట్ల నుంచి ప్రకృతి అందాలను తిలకించారు. అటవీసముదాయంలో కలెక్టర్ డబ్ల్యూ.డీ. హార్సిలీ నిర్మించిన తొలి అతిథిగృహాన్ని, ఆయన నాటిన మహా నీలగిరి వృక్షాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించగా అటవీ సిబ్బంది బద్రినాథ్ వాటి గురించి వివరాలు తెలిపారు. గాలిబండపై ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు. చిన్నారులు ప్రకృతి ఒడిలో ఆడుకుంటూ కనిపించారు.

వలంటీర్లతో విప్లవాత్మకమైన సేవలు


వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు విప్లవాత్మకమైన సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను పొందిన వలంటీర్లకు మున్సిపల్ కార్యాలయంలో, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి అవార్డులు పొందిన వలంటీర్లను ఎంపీడీఓ కార్యాలయంలో వారు ఘనంగా సత్కరించి ప్రోత్సాహక పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ప్రజలు చిన్నపనికి సైతం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారన్నారు. అలాగే వివిధ రకాల సర్టిఫికెట్లను కూడా వలంటీర్లు ప్రజల ఇళ్ల వద్దకు వచ్చి దరఖాస్తు చేయించి, మళ్ళీ వారికి ఆ పత్రాలను స్వయంగా అందజేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇలాంటి సేవలు ప్రజలు గతంలో ఎప్పుడైనా పొందేవారా? అని వారు ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయాలన్న తపన జగన్‌లో ఉన్నందునే ఆయన మదిలో మెదలైందే ఈ బృహత్తరమైన వలంటీర్ల వ్యవస్థ అన్నారు. వలంటీర్లు కూడా వేతనం కోసం కాకుండా సేవ చేయాలన్న అంకితభావంతో ప్రజలకు ఎనలేని సేవ చేస్తున్నారని తెలిపారు. వలంటీర్లను సీఎం తన సైన్యంగా భావిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను, గ్రామ సచివాలయాలను తొలగిస్తామని చంద్రబాబునాయుడు చెబుతుండటం చూస్తే ప్రజలకు మేలు జరగడం బాబుకు ఇష్టం లేదన్నది తేటతెల్లమవుతుందని తెలిపారు. చంద్రబాబునాయుడు తన హయాంలో పేదల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతి, మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ రాముయాదవ్, మున్సిపల్ కమీషనర్ జనార్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ బాలమునుస్వామి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు జెనుగు కృష్ణారావుయాదవ్, బొల్లినేని రామ్మోహన్ నాయుడు, వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అవధూత నారాయణ స్వామి ఆరాధనోత్సవాలు

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో వెలసిన అవధూత నారాయణస్వామి 74వ ఆరాధనోత్సవాలను ఆదివారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సీతారాంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల కోరికలను నెరవేర్చిన అవధూత నారాయణ స్వామి సుమారు 74వ వార్షికోత్సవాన్ని ఆదివారం 4వ తేదీన 6.30గంటలకు ఓబుల్‌రెడ్డిగారిపల్లెలోని ఆయన మందిరంలో జరుపనున్నామని పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతి, 12.40నిమిషాలకు అభిషేకం, 1.20 నిమిషాలకు మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదం తదుపరి అన్నదానం, సత్యసాయి జిల్లా కదిరి వాస్తవ్యులచే రాత్రి 9గంటలకు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర కళా బృందంచే సాసవుల చిన్నమ్మ కథను నాట్య రూపంలో ప్రదర్శించబడుతుందన్నారు. అలాగే బండలాగుడు పోటీలులు నిర్వహించి మొదటి బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.11వేలు , నాలుగవ బహుమతి రూ.9వేలు, 5వ బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

రాఘవేంద్ర స్వామికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో రాఘవేంద్ర స్వామి ఆలయాలలో గురువారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు స్వాములవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


అలంకారంలో రాఘవేంద్రుడు